క్లుప్తంగా

నేటి నుంచి నందదీప సేవ

ఆదోనిఅర్బన్: శరన్నవరాత్రి సందర్భంగా గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు మంగరాయ సన్నిధిలో నందాదీప సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ శ్రీపాదులవారి ఆదేశాల మేరకు నందాదీప సేవా కార్యక్రమం పది రోజులపాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు 9110731103 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సమస్యలపై స్పందించాలి

ఆదోని రూరల్: స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని సీపీఎం గ్రామ సీనియర్ సభ్యులు ఉలిగప్ప, మండల కార్యదర్శి లింగన్న, నాయకులు తిక్కప్ప అన్నారు. బుధవారం మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. నూతనంగా గ్రామ శాఖ కార్యదర్శిగా పరమేష్‌ను, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు నాగరాజు, ఉలిగప్ప, మూకప్ప, ఏలీయా, చిన్న, నరసప్ప పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



చీపురు పట్టిన ఎంపీడీఓ దశరథ రామయ్య

నందవరం: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ దశరథ రామయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మండల అధికారులు చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు ఐరన్‌బండ తదితర గ్రామాల్లో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్ బుధవారం జెండాను ఆవిష్కరించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మారేష్, తాయప్ప, నరసింహులు, ఈరన్న, బతకన్న, చిన్న మునెప్ప, రంగన్న పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో వెనకబడిన దళితులు అణిచివేతకు గురవుతున్నారని కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిన్న మారయ్య, వీరేష్ అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో జెండాను ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, చిన్న మారయ్య, బసవరాజు, ఆదాం, వీరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో గాంధీ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామపెద్దలు, యువకులు, గ్రామ సర్పంచ్ హెచ్.రాము, ఉప సర్పంచ్ మల్లిరెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, బి.పి.బసవరాజు, బిపి నాగరాజు, బోయ నాగరాజు, శివయ్యన్న, టీచర్ మల్లి తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. ఆదినారాయణ అనే 74 ఏళ్ల వృద్ధుడు రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.

నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ నిరసన

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ ఏపీ మహిళా సమాఖ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కొరపాటి జయమ్మ, యస్.కోటమ్మ, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అంజిత్‌గౌడ్, రమేష్‌కుమార్, దస్తగిరి మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల బెల్టుషాపులు ఏర్పడి వీధివీధికి తాగుబోతులను తయారవుతారన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు మాణిక్యమ్మ, గోవిందమ్మ, హనుమంతమ్మ, అంజినమ్మ, నాయకులు లక్ష్మీనారాయణ, రాముడు తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీకి బహుమతి అందజేస్తున్న జడ్జి పి.జె.సుధ



పారిశుద్ధ్య కార్మికుల కాళ్లను కడుగుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



ఎల్ఐసీ కార్యాలయంలో గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న సిబ్బంది



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎమ్మిగనూరులో గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొల్ల కేశన్న, ఎంపీడీఓ బంగారమ్మ

గాంధీ మహాత్ముడు అందరికీ ఆదర్శం

- ఘనంగా గాంధీ జయంతి
- జాతిపితకు నివాళి

ఆదోని రూరల్: జాతిపిత మహాత్మాగాంధీ అందరికీ ఆదర్శమని జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె.సుధ అన్నారు. బుధవారం సబ్‌జైలులో జైలు పర్యవేక్షణాధికారి నజీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె. సుధ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు శ్రమించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారికి శిక్ష తగ్గుతుందని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కుమారి శ్రీవల్లి, కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది, లీగల్ అడ్వకేట్ ఆనంద్ పాల్గొన్నారు.

- ఆదోని పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గీతావాణి, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మహాత్మాగాంధీ ఎందరికో స్ఫూర్తి

ఆదోని అర్బన్:మహాత్మాగాంధీ ఎదరికో స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని ఆదోని మున్సిపల్ నెహ్రూ పీస్ పార్క్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి సందర్భంగా బుధవారం మహాత్మాగాంధీ చిత్రపటానికి సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 30 మంది పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల కాళ్లను ఎమ్మెల్యే పార్థసారథి కడిగి వారి సేవలను కొనియాడారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి గాంధీ పార్క్ వరకు ర్యాలీగా వెళ్లి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణాధ్యక్షుడు బి.దేవా, సీనియర్ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణ ఎస్సీ సెల్ నాయకులు కె.మల్లెల తాయన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాసు, వైస్ చైర్మన్ నరసింహులు, కిశోర్, అశోక్, సందీప్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: జాతిపిత మహాత్మాగాంధీ సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బందితో కలసి పార్కులోని మహాత్మాగాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదోని సెంట్రల్: ఎల్ఐసీ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ మనెప్ప ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, ఎల్ఐసీ ఏజెంట్లు మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లియాఫీ సంఘం ఆవిర్భవించి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలను చేసుకున్నారు.

- ఆదోని పట్టణంలోని మిల్టన్ పాఠశాలలో మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వీరశైవలింగాయత్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు రుద్రగౌడ్, రాష్ట్ర శాప్‌నెట్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ యూకే రాజశేఖర్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు గాంధీ చౌక్ వద్దకు ర్యాలీగా వచ్చి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఆర్యవైశ్య సంఘ నాయకులతో పాటు పలు సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు రాజారత్నం, డిష్‌కేశవరెడ్డి, సుధాకర్, వెంకటాపురం బజారి, ఎంకే శివప్రసాద్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అబ్రార్, పాల శ్రీనివాసరెడ్డి, గుడికల్ భాస్కర్, డిష్ రఫీక్, సోమేష్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాల ని కోరుతూ యూటీఎఫ్ నాయకులు నాగమణి, పంపాపతి, ఎల్లప్ప, నరసింహులు, దేవపాల్ తదితరులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు.



ఎమ్మిగనూరులో గాంధీ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న రుద్రగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: మండలం కేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం జాతి పిత మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా చేపట్టి గ్రామసభను నిర్వహించారు. కౌతాళంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్, ఎరిగేరిలో సర్పంచ్ గోవిందులు గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

కోసిగి: మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హారూన్ రషీద్, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ అయ్యమ్మ సమక్షంలో జాతి పిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల విజయవాడలో వరద ప్రాంతాల్లో వెళ్లి పని చేసిన పారిశుద్ధ్య కార్మికులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

పెద్దకడబూరు : గాంధీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంతో పాటు సచివాలయం- 1లో, మండల పరిధిలోని పీకలబెట్టగ్రామ సచివాయలంలో వేడుకలను జరుపుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు రామాంజినేయులు, మూలింటి లక్ష్మి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు.

ఎమ్మిగనూరులో ఘనంగా గాంధీ జయంతి

గోనెగండ్ల : స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ గంగాధర్, డంపింగ్ యాడ్ వద్ద ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, సర్పంచ్ హైమవతి, మాజీ ఆప్షన్ మెంబర్ బందెనవాజ్ పాల్గొన్నారు.

నందవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దశరథ రామయ్య, అధికారులు, సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్ : గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని ఎంపీడీవో కార్యాలయం, బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి పాల్గొన్నారు.



ఎరిగేరిలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



కోసిగిలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ అయ్యమ్మ



పెద్దకడబూరు ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



గోనెగండ్లలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ గంగాధర్



నందవరంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీఓ దశరథ రామయ్య, సిబ్బంది

నేటి నుంచి ‘టెట్’ పరీక్షలు

ఆదోని సెంట్రల్: టెట్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం భీమా ఇంజనీరింగ్ (బిట్స్) కళాశాలలోని టెట్ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు రెండు సెషన్‌లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రతి సెషన్‌కు 100 మంది అభ్యర్థులు చొప్పున 3,100 మంది అభ్యర్థులు పరీక్షలను రాస్తారన్నారు. అనంతరం కళాశాలలోని సిస్టమ్స్ పనితీరు, అవసరమైన సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ యం. శ్రీనివాసులు మండల విద్యాధికారి-2 బాలచంద్రుడు, టీసీఎస్ టెక్నో ఇన్‌చార్జ్‌కు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి

న్యాయం కోసం నిరాహార దీక్ష



దీక్షలో కూర్చున్న గోవిందమ్మ

ఎమ్మిగనూరుటౌన్: తనకు న్యాయం చేయాలని కోరుతూ పెద్దకడుబూరు మండలం కల్లుకుంట్ల గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మ బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో నిరాహార దీక్ష చేపట్టింది. ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని బీసీ కులస్తులు తనను స్తంభానికి కట్టి దాడి చేశారని, ఇలాంటి ఘటన మరెవరికి జరుగకూడదన్నారు. తనపై దాడి చేసిన 9 మందిపై మాత్రమే కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారని, మరికొందరిపై కేసు నమోదు చేయాలని కోరారు. దీక్షకు పలు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

విజ్ఞానంపై అవగాహన కల్పించాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పించడం చాల అవసరమని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం అలీమ్ సిద్ధిఖీ అన్నారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా బుధవారం మాస పత్రికను యూటీఎఫ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పత్రిక విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంచుతుందని, శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తుందని చెప్పారు. అనంతరం నిర్వహించిన చెకుముకి పోటీల్లో ప్రైవేటు విభాగంలో స్థానిక వింధ్యశ్రీ పాఠశాల ప్రథమ స్థానం, మిల్టన్ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, దొడ్డనగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయని సీనియర్ యూటీఎఫ్ నాయకులు కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదిమూర్తి, రుద్రముని, సుధాకర్, సువేదమ్మ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజాసేవకు సీతారాం ఏచూరి జీవితం అంకితం

ఎమ్మిగనూరుటౌన్: ప్రజాసేవకు సీపీఎం అగ్రనేత సీతారం ఏచూరి అంకితమై పనిచేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో డివిజన్ కార్యదర్శి గోవిందు అధ్యక్షతన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఎన్నో ఉద్యోగ అవకాశాలు వదులుకొని ప్రజా సేవ, పోరాటాలు చేసేందుకు జీవితాన్ని అంకితం చేశారన్నారు. విద్యార్థి దశ నుంచే ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. సభలో ప్రజా వైద్యులు మాలకొండయ్య, ఏఐసీసీ నాయకులు మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సీపీఐ నాయకులు పంపణ్ణగౌడ్, రంగన్న, టీడీపీ నాయకుడు కదిరికోట ఆదెన్న, సీపీఐ ఎంఎల్ నాయకుడు రాజు, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు పంపాపతి, పౌరహక్కుల సంఘ నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

పదవీ విరమణ ఉపాధ్యాయులకు సన్మానం

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను స్థానిక ఎమ్మెల్యే డా.పార్థసారథి సన్మానించారు. బుధవారం పట్టణంలోని శంకరమఠంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పించడానికి తమ వంతు కృషి చేసి పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు చంద్రశేఖరయ్య, మోనయ్య, గంగాధరయ్య, శంకరయ్య, సురేంద్రనాథ్ గుప్తా, గుండయ్య, వసంత, వెంకటరమణ, రాముడు, ప్రతాఫ్ సూర్యా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు వై.సిద్దలింగ, పదోన్నతి పొందిన బి.వెంకటేశులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రంగన్న, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘురామయ్య, మండల నాయకులు ముత్తన్న, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే డా. పార్థసారథి

బసవేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: మండల కేంద్రం కోసి గిలోని బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామి కి బుధవారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకు ని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు.

బంగారమ్మకు పూజలు

నందవరం: మండల కేంద్రం నందవరంలో బంగారమ్మ దేవికి, భీమలింగేశ్వర స్వామికి అమావాస్య పూజలు నిర్వహించారు. బుధవా రం అమ్మ వారికి, స్వామికి పూజారులు, భక్తు లు అమావాస్య కావడంతో తెల్లవారుజామున జలాభిషేకాలు, కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలు గావించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య వేడుకలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో బుధవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

పింఛన్ కోసం పాట్లు

ఆదోని సెంట్రల్: బతుకుదెరవు నిమిత్తం వలస వెళ్లిన వారు, ఆయా పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లిన వారు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఆదోని పట్టణానికి చెందిన దివ్యాంగుడు సుంకన్న బతుకుదెరవు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. పింఛన్ తీసుకోవడానికి 1వ తారీఖు రావాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల రాలేకపోయాడు. దీంతో బుధవారం పింఛన్ తీసుకునేందుకు వచ్చాడు. తీరా వార్డు సచివాలయానికి వెళ్తే డోర్ లాక్ చేసి ఉంది. స్థానిక సచివాలయ సిబ్బందికి ఫోన్ చేస్తే ఈ రోజు లేదు గురువారం రమ్మన్నారు. చేసేది ఏమి లేక కర్నూలులో అక్క వాళ్ల ఇంటికి వెళ్లి వస్తానని వెళ్లి పోయాడు. అదే వలంటీర్లు ఉంటే పింఛన్ కోసం వేచి ఉండే పరిస్థితి వచ్చేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



వార్డు సచివాలయం వద్దకు పింఛన్ కోసం వచ్చిన సుంకన్న

నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

కోసిగి: మండల పరిధిలోని కందుకూరులో వెలసిన శ్రీ శాంభవి దేవి ఆలయంలో గురువారం నుంచి దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దసరా ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు అమ్మవారి వివిధ రూపాలలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు గానూ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు దేవి పురాణం భక్తులకు వినిపిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



నవరాత్రి ఉత్సవాలకు విద్యుదీపాలతో ముస్తాబైన శాంభవి దేవాలయం

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వార్డు వలంటీర్లు

ఎమ్మిగనూరుటౌన్: వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించి వార్డు, గ్రామ వలంటీర్లను వెంటనే విధుల్లో తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు.బుధవారం పట్టణంలో వలంటీర్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి వైఎస్సార్ సర్కిల్, సోమప్ప సర్కిల్ మీదుగా గాంధీ చౌక్ వద్దకు వెళ్లి మహాత్ముడి విగ్రహానికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గాంధీజీ స్ఫూర్తితో గ్రామ స్వరాజ్యం నెలకొల్పేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రారంభించి ఐదేళ్లు ప్రజలకు సేవలందించారన్నారు. గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు రూ.10వేల వేతనం ఇచ్చి వలంటీర్ వ్యవస్థను కొనసాగించి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అదేవిధంగా పెండింలో వున్న ఐదు నెలల వేతనాన్ని మంజూరు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వలంటీర్ల యూనియన్ నాయకులు రవి, పుష్ప, ఈరమ్మ, శిరీష, పూర్ణ, జ్యోతి, ఉషారాణి, నవీన్, నరసన్న, కళ్యాణ్ కుమార్, విజయ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో లక్ష పుష్పార్చన

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా డిప్యూటీ కమిషనర్ విజయ్‌రాజ్ ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. అమావాస్య రోజు ఇలాంటి పూజల్ని చేపట్టడం వల్ల భక్తుల్లో భక్తి భావం పెరుగుతుందన్నారు. ఈ అమావాస్య నుంచే ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీసీ తెలిపారు. ఇకపై ప్రతి అమావాస్యకు ఇలాంటి కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పుష్పార్చన పూజల్లో పాల్గొనలనుకున్న భక్తులు తమ పేర్లను ముందుగానే దేవాలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అమావాస్య సందర్భంగా ఉరుకుంద క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తమ ఇంటి ఇలావేల్పును దర్శంచుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.



లక్షపుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు